## మూడవ పాఠం الدرس الثالث

### ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం النبي محمد ﷺ

అల్లాహ్ అద్వితీయుని ఆరాధన గురించి ప్రజలకు మార్గదర్శకత్వం చేయడానికి, దీనికి విరుద్ధంగా వారు పాటిస్తున్న విగ్రహాల ఆరాధనను ఖండించడానికి అల్లాహ్ 'ముహమ్మద్' సల్లల్లాహు అలైహి వసల్లంని అంతిమ ప్రవక్తగా పంపాడు. మరియు ప్రవక్తలు మానవులకు ఇస్తూ వచ్చిన సందేశాలన్నింటిలో ఈ ప్రవక్తకు ఇవ్వబడిన సందేశాన్ని చిట్టచివరిదిగా చేశాడు. (అంటే సర్వ మానవులు ఈ ప్రవక్తను, ఈ ప్రవక్త తీసుకువచ్చిన సందేశాన్ని నమ్మక, ఆచరించక తప్పదు).

మక్కా నగరములో, నలభై సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యాక 'ముహమ్మద్' సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రవక్త పదవి లభించినది. ప్రవక్త పదవికి ముందు నుంచే ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తమ జాతివారిలోనే కాదు, సర్వ మానవుల్లోకెల్లా ఉత్తమ నడవడిక, సద్వర్తన కలిగి ఉన్నవారు. సత్యాన్ని పాటించడం, అమానతులను కాపాడటంలో ఆయనకు ఆయనే సాటి. సభ్యతా, సంస్కారంలో కూడా ఉన్నత శిఖరాన్ని అందుకున్నవారు ఆయనే. అందుకే తమ జాతివారే ఆయనకు "అమీన్" (విశ్వసనీయుడు) అన్న బిరుదునిచ్చారు. ఆయన "ఉమ్మీ". అంటే చదవడం, వ్రాయడం రానివారు. అటువంటి వారిపై అల్లాహ్ దివ్య ఖుర్ఆన్ అవతరింపజేసి, సర్వ మానవులు ఏకమై కూడా దీని వంటిది తీసుకురాలేరని ఛాలెంజ్ చేశాడు.

### ఇస్లాం ధర్మం యొక్క పునాదులు أسس الدين الإسلامي

**1- అల్లాహ్ పై విశ్వాసం:** ఇది ఇస్లాం ధర్మం యొక్క అసలైన పునాది. అల్లాహ్ పై విశ్వాసం అంటేః అల్లాహ్ ఉన్నాడని, అతడే ప్రతిదానికి పోషకుడు, అధికారి, ఏకైక సృష్టికర్త మరియు సర్వ జగత్తును నడిపేవాడని గాఢంగా విశ్వసించుట. ఇంకా అతడొక్కడే సర్వ ఆరాధనలకు అర్హుడు, అతనికెవ్వడూ భాగస్వామి లేడు. సర్వ ఉత్తమ గుణాలు గలవాడు. ప్రతి లోపాలకు, దోషాలకు అతీతుడు. తన సృష్టిలో దేనికీ పోలినవాడు కాడు అని దృఢంగా విశ్వసించాలి.

**2- దైవదూతలపై విశ్వాసం:** వారు మన కళ్ళకు కనబడని ఒక సృష్టి. అల్లాహ్‌యే వారిని పుట్టించాడు. వారు అల్లాహ్ ను మాత్రమే ఆరాధిస్తారు. రుబూబియత్, ఉలూహియత్ కు సంబంధించిన ఏ ప్రత్యేకతలు వారిలో లేవు. ముస్లిం వారి ఉనికినీ మరియు వారి సరియైన సంఖ్య అల్లాహ్ కు తప్ప ఎవరికీ తెలియదని విశ్వసించాలి.

***3- గ్రంథాలపై విశ్వాసం:*** సత్యాన్ని స్పష్ట పరచుటకు మరియు ప్రజల్ని అల్లాహ్ వైపునకు పిలుచుటకు పూర్వ ప్రవక్తల్లో కొందరిపై అల్లాహ్ గ్రంథాలను అవతరింపజేశాడని ముస్లిం విశ్వసించాలి. ఉదా: తౌరాత్ మూసా అలైహిస్సలాంపై, ఇంజీల్ ఈసా అలైహిస్సలాంపై, జబూర్ దావూద్ అలైహిస్సలాంపై. చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ ﷺ పై అల్లాహ్ ఖుర్ఆన్ అవతరింపజేశాడని విశ్వసించాలి.

***ఖుర్ఆన్:*** సర్వమానవాళికి ఇది అల్లాహ్ యొక్క అంతిమ సందేశం. ఖుర్ఆన్ మరియు ప్రవక్తవారి సహీ హదీసుల ప్రకారంగా ఉన్నవారి ఆచరణలనే అల్లాహ్ అంగీకరిస్తాడు. దీని ప్రత్యేకమైన ఒక విషయం: 'దీనిని కాపాడే బాధ్యత స్వయంగా అల్లాహ్ తీసుకున్నాడు'; అందుకే ఇందులో మార్పులు చేర్పులు జరగటానికి ఏ ఆస్కారం లేదు. పూర్వ గ్రంథాలు మార్పు చేర్పులకు గురి అయ్యాయి; ఎందుకనగా అల్లాహ్ వాటి రక్షణా బాధ్యత తీసుకోలేదు.

***4- ప్రవక్తలపై విశ్వాసం:*** ప్రజల్ని అల్లాహ్ వైపు ఆహ్వానించడానికి, దానికి వ్యతిరేకంగా ఉన్న దాని నుండి ఖండించడానికి అల్లాహ్ ప్రవక్తలను పంపాడని ముస్లిం విశ్వసించాలి. వారు మానవులు. అల్లాహ్ వారిని సృష్టించాడు. రుబూబియత్, ఉలూహియత్ కు సంబంధించిన ఏ ప్రత్యేకతలు వారిలో లేవు. (ఇవి అల్లాహ్ ప్రత్యేకతలు మాత్రమే). అన్నపానీయాలు, చావు బ్రతుకుల్లాంటి మానవ అవసరాలే వారికీ ఉన్నాయి. ప్రవక్తలు సర్వమానవుల్లో శ్రేష్ఠులు. అల్లాహ్ వారిని సందేశహరులుగా, ప్రవక్తలుగా ఎన్నుకున్నాడు. వారిని విశ్వసించుట అంటే వారికి ఇవ్వబడిన సందేశం సత్యం అని, వారిలో ఎవరి పేర్లు మనకు తెలియునో వారిని ఆ పేరతోనే విశ్వసించాలి. వారు ఇచ్చిన వార్తలను సత్యంగా నమ్మాలి. చివరి ప్రవక్త ముహమ్మద్ ﷺ తెచ్చిన ధర్మాన్ని ఆచరించాలి. ఆయన ﷺ తర్వాత ఇంకెవ్వరి ధర్మం కూడా చెల్లదు. అంగీకరించబడదు.

***5- పరలోక విశ్వాసం:*** అదే ప్రళయదినం. ఆ రోజున పాపపుణ్యాల లెక్క తీసుకొని ప్రతి ఒక్కరికి తగిన ఫలితమిచ్చుటకు అల్లాహ్ అందరినీ సమాధుల నుండి లేపుతాడు. స్వర్గవాసులు తమ స్థానంలో మరియు నరకవాసులు తమ స్థానంలో ఉండిపోతారు.

***6- విధివ్రాతపై విశ్వాసం:*** భూత, వర్తమాన, భవిష్యత్ కాలాల జ్ఞానమంతయు అల్లాహ్ కు గలదు. అల్లాహ్ కోరినదే జరుగును, ఆయన కోరనిది జరగదు. ఏది సంభవించినా ఆయన జ్ఞానంతో మరియు ఇష్టంతోనే సంభవిస్తుందని విశ్వసించాలి.